ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 24 నవంబరు 2025

ఆదిత్యుని ఆదాయం రూ.7.67లక్షలు

అరసవల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరవసల్లికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచే క్యూలో బారులుదీరారు. ఆరోగ్యప్రదాత శ్రీ సూర్యనారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆదిత్యుడికి రూ.7,67,235 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.4,55,800 రాగా, విరాళాల రూపంలో రూ.64,700లు, ప్రసాదాల ద్వారా రూ.2,64,735 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

విషాద యాత్ర



లారీని ఢీకొని నుజ్జయిన కారు.. లోపల చిక్కుకున్న మృతదేహాలు

వారంతా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. తీర్థయాత్రలో భాగంగా పలు పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లి వస్తుండగా.. రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రివేళ హైవేపై ఆగిఉన్న లారీని వారు ప్రయాణిస్తున్న కారు ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే నలుగురు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల కుటుంబ సభ్యులు, క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

- పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లివస్తూ రోడ్డు ప్రమాదం
- ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు
- నలుగురి మృతి, ఆరుగురికి గాయాలు
- ఎత్తురాళ్లపాడు వద్ద ఘటన
- నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి, రిమ్స్‌కు క్షతగాత్రుల తరలింపు
- మృతులు, బాధితులంతా మధ్యప్రదేశ్ వాసులు
- మిన్నంటిన ఆర్తనాదాలు



నరసన్నపేట ఆస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

కోటబొమ్మాళి/ నరసన్నపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి)

కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు వద్ద శనివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో.. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ సమీపంలోని ఖండవ జిల్లా నేతన్య గ్రామానికి చెందిన బోరో సింగ్‌పవర్(60), విజయ్‌సింగ్ తోమర్(65), ఉషీర్‌సింగ్(62), సంతోషిబాయ్(62) మృతి చెందారు. అలాగే శకుంతల బాయ్, సుమన్‌బాయ్, సంతోషి బాయ్, సావిత్రిబాయ్, సహస్రబాయ్‌తోపాటు వాహన డ్రైవర్ (మిగతా 7వ పేజీలో..)



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సేవా మార్గాన్ని అనుసరించాలి

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- ఘనంగా భగవాన్ సత్యసాయి జయంతి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పాత శ్రీకాకుళం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): 'అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు' అన్న భగవాన్ సత్యసాయిబాబా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, మానవసేవే మాధవసేవగా జీవితాన్ని గడపాలని కేంద్రపౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ప్రధాన సత్యసాయి బాబా ఆలయంలో ఆదివారం ఘనంగా బాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై సత్యసాయిబాబా విగ్రహానికి పూలమాల వేసి, ఆలయ కమిటీ సభ్యులతో కేకును కత్తిరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సత్యసాయిబాబా జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తోందన్నారు. రాయలసీమకు మంచినీరు, ప్రపంచస్థాయిలో విద్య ఉచిత వైద్యసేవలను అందించిన మహనీయుడు సాయిబాబా అని తెలిపారు. భావితరాలకు ఆదర్శమూర్తుల జీవితాలను తెలియజేస్తున్న తల్లిదండ్రులను కేంద్రమంత్రి ప్రశంసించారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ... సత్యసాయి సందేశంతో ప్రేరణ పొందిన భక్తులు దేశ విదేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో సత్యసాయి సేవాసమితి చేస్తున్న సేవలను అభినందించారు. ప్రతి సోమవారం జిల్లా పరిషత్తు వద్ద వినతుల కార్యక్రమంలో దాదాపు 200 మంది అర్జీదారులకు భోజనాలు అందించడం, 15 ఏళ్లుగా పెద్ద ఆసుపత్రి వద్ద నిరంతరంగా అన్నదానం చేయడాన్ని కొనియాడారు. విపత్తులు, తుపాన్‌ల సమయంలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న వలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. వేడుకల్లో డీఆర్వో లక్ష్మణమూర్తి, ఆర్డీవో సాయిప్రత్యూష, మెండ దాసు నాయుడు, ఆలయ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు అందవరం ప్రసాద్, పాండ్రంకి శంకర్, విస్సు దేవళ్ల, సాయి భక్తులు పాల్గొన్నారు.



ఉజ్జుడుమెట్టపై కంకర తవ్వకాల కారణంగా ఏర్పడిన గోతులు

ఉజ్జుడుమెట్ట పాయే!

- 30 ఎకరాల్లో కంకర అక్రమ తవ్వకాలు
- రాత్రివేళ యథేచ్ఛగా తరలింపు

పలాస, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస-మందస మండలాల సరిహద్దులో ఉన్న ఉజ్జుడు మెట్టపై కంకర అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ కొండభాగం మొత్తం 30 ఎకరాలకుపైగా విస్తరించి ఉంది. రెండున్నరేళ్ల కిందట చరణ్ రియల్‌ఎస్టేట్ సంస్థ కొంతమంది పట్టాలు ఉన్న రైతుల వద్ద భూమిని కొనుగోలు చేసింది. ప్లాట్లు వేయడానికి అందులో ఉన్న మొక్కలు తొలగించింది. కాగా దీనిపై తమకు సర్వహక్కులు ఉన్నాయని, ఆ ప్రాంతంలో కొంతమంది మాజీ మావోయిస్టులకు కూడా అక్కడ పట్టాలు ఉన్నాయంటూ ఉద్దానం (మిగతా 8వ పేజీలో..)

ఆ వేతనదారులు ఎక్కడ ఉన్నారో?

- 19,179 జాబ్‌కార్డుల రద్దుకు సన్నాహాలు
- వైసీపీ హయాంలో బోగస్ మస్తర్ల పేరిట నిధుల దోపిడీ

మెళియాపుట్టి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. బోగస్ జాబ్‌కార్డుల పేరిట నిధులు స్వాహా చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వేతనదారులకు ఈకేవైసీ తప్పనిసరి చేసింది. ఇటీవల జాబ్‌కార్డుల పరిశీలించగా.. బోగస్‌వి ఉన్నట్టు గుర్తించింది. జిల్లాలో ప్రస్తుతం 56,541 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇంకా 19,179 మంది ఈకేవైసీ నమోదు చేయించలేదు. వీరంతా ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి దూరప్రాంతాల్లో ఉన్నవారికి ఓటీపీ ద్వారా ఈకేవైసీ నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. అప్పటికీ ఈకేవైసీ పూర్తికాని వారి జాబ్‌కార్డుల రద్దుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా.. గతంలో కొంతమంది ఫీల్డ్‌అసిస్టెంట్లు కొత్త జాబ్‌కార్డులకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల బోగస్ మస్తర్లు వేసి ఉపాధిహామీ నిధులు పక్కదారి పట్టించినట్లు ఆడిట్‌లో కూడా తేలింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడంతో తాజాగా జాబ్‌కార్డుల్లో అక్రమాల లెక్క తేలనుంది.



వేతనదారులకు ఫొటో తీసి ఈకేవైసీ నమోదు చేస్తున్న దృశ్యం





బ్రాండెడ్ బస్తాలో బియ్యం.. అరకిలో తరుగు చూపిస్తున్న వైనం

సన్నబియ్యం పేరిట మోసం

- రేషన్ బియ్యాన్ని రీపాలిష్ చేసి దోపిడీ
- బ్రాండెడ్ సంచుల్లో నింపి.. అధిక ధరకు విక్రయం
- ఆపై తూకంలోనూ బస్తాకు 2 కిలోల వరకు తరుగు

రణస్థలం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి)

రణస్థలంలో ఇటీవల సన్నబియ్యం, బ్రాండెడ్ బియ్యం 25 కిలోల బస్తాను రూ.1000కి చొప్పున అందిస్తామని ఇద్దరు వ్యక్తులు చెప్పడంతో చాలామంది కొనుగోలు చేశారు. శాంపిళ్లలో సన్నబియ్యాన్ని చూపించి.. తీరా బస్తాల్లో ముతక బియ్యాన్ని అందించి మోసం చేశారు. చివరకు ఓ హోటల్ యాజమానికి అందించే క్రమంలో ఆ ఇద్దరు వ్యక్తులు దొరికిపోవడంతో స్థానికులు నిలదీశారు. సన్నబియ్యం పేరిట వసూలు చేసిన మొత్తాన్ని ఇవ్వడంతో వారిని విడిచిపెట్టారు.

ఇలా.. జిల్లాఅంతటా సన్నబియ్యం పేరిట దందా కొనసాగుతోంది. చాలామంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి, బ్రాండెడ్ ఖాళీ సంచుల్లో ప్యాకింగ్ చేసి సన్నబియ్యం పేరిట అధిక ధరకు విక్రయిస్తున్నారు. ప్రజలను మోసగిస్తున్నారు. జిల్లాలో 10లక్షల కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. నెలకు సగటున 12లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విక్రయాలు జరుగుతున్నాయి. పేదలకు ప్రభుత్వం చౌకధరల దుకాణం ద్వారా (మిగతా 7వ పేజీలో..)



టెక్కలిలో పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సుందరీకరణ దిశగా టెక్కలి

- మంత్రి అచ్చెన్న చొరవతో నిధులు మంజూరు 8లో

చీడిపూడి వేంకటేశ్వరాలయంలో చోరీ

వెండి ఆభరణాలు, ఇత్తడి వస్తువుల అపహరణ 8లో

బెంబేలెత్తిస్తున్న కుక్కలు 8లో

- మూడు నెలల్లో 300 కేసులపైనే..
- రోడ్డుపై నడవాలంటే భయాందోళన

ముగిసిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు 7లో

అర్జీదారుల సమస్యలు పరిష్కరించండి

● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



వినతులు స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో ఆది వారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వినతులను స్వీకరించారు. వ్యక్తిగతంగా అర్జీలు స్వీకరించి వాటికి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి పరిష్కారాలను సూచించారు. పలువురు దివ్యాంగులు కేంద్ర మంత్రిని కలిసి వినతులు ఇచ్చేందుకు రాగా వారి వద్దకే ఆయన వెళ్లి సమస్యలు అడిగి తెలుసు కున్నారు.

సామాజిక భవనం మంజూరు చేయండి

ఇచ్ఛాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం కీర్తిపురం పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్క రించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఆదివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం శ్రీకాకుళంలో క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో సామాజిక భవన నిర్మించాలని, శ్మశాన వాటికలో షెడ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, కార్య దర్శి డి.కామేష్, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, గిన్ని బాలరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి అభినందన

రణస్థలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన ముక్క ఆదినారాయణను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందించారు. ఆదివారం శ్రీకాకుళంలోని క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాగబాబు

ఇచ్ఛాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధి ఆర్.బెలగాం గ్రామానికి చెందిన తిప్పన భుజంగరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పార్టీ క్రియా శీలక సభ్యుల బీమా పథకం కింద రూ.5 లక్షల చెక్కును ఆదివారం తాడేపల్లిలోని ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో జిల్లాలో 12 మంది మృతి చెందగా వారికి పార్టీ తరఫున బీమా చెక్కులను అందించారని, వారిలో భుజంగరావు ఒకరని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పేరిట మోసం

(ఐదో పేజీ తరువాయి)

రేషన్ బియ్యం అందిస్తోంది. కానీ ఆ బియ్యాన్ని తింటోంది కేవలం 10 శాతం మాత్రమే. వ్యవసాయ భూములు లేనివారు, నిరుపేదలు ఎక్కువగా రేషన్ బియ్యం తింటున్నారు. మిగతా మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వారు మాత్రం రేషన్ బియ్యాన్ని వినియోగించడం లేదు. సన్న బియ్యాన్ని మార్కెట్‌లో కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. కాగా కొందరు వ్యాపారులు సన్నబియ్యం పేరిట ముదక బియ్యాన్ని అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. 25 కిలోల రేషన్ బియ్యం సుమారు రూ.500 చొప్పున కార్డుదారుల వద్ద కొనుగోలు చేసి.. వాటిని రీపాలిష్ చేస్తున్నారు. స్టీమ్‌లైజ్ యంత్రాలతో సన్నబియ్యంగా మార్చేసి.. పేరుమోసిన బ్రాండెడ్ బ్యాగుల్లో వాటిని నింపేసి 25 కేజీల బస్తా రూ.వెయ్యికి పైగా విక్రయిస్తూ లాభపడుతున్నారు.

● **నిబంధనలు బేఖాతరు!**

సీసీలు, మసూరీల పేరుతో జిల్లాలో ఎక్కువగా బియ్యం విక్రయిస్తుంటారు. సాధారణంగా పాత ధాన్యానికి సంబంధించి మిల్లు చేసిన బియ్యం ఎంతో బాగుంటాయి. తినేందుకు సౌకర్యంగా ఉంటాయి. కానీ జిల్లాలో అది జరగడం లేదు. రేషన్ బియ్యాన్ని రీ పాలిష్ చేసి వాటినే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. పుట్టగొడుగుల్లా రైస్‌స్టోర్లు సైతం వెలుస్తున్నాయి. రైస్ డిపోల ఏర్పాటుకు ప్యాకేజ్డ్ కమోడిటీస్ యాక్ట్ కింద తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. బియ్యం సంచులపై బ్రాండ్ పేరు, ఎన్ని కిలోలు, ఎమ్మార్పీ, తయారీ సంస్థ, చిరునామా, ప్యాకింగ్ తేదీ, ఫోన్ నంబరు తప్పనిసరిగా ముద్రించాలి. బియ్యం అమ్మకాలపై కేంద్ర ప్రభుత్వం 5 శాతం పన్ను విధించిన నేపథ్యంలో తప్పనిసరిగా జీఎస్టీ లైసెన్స్ తీసుకోవాలి. కానీ ఈ నిబంధనలేవీ జిల్లాలో కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో రైస్‌డిపోలు ఉండగా.. ఇలా అనుమతులు పొందినవి ఒకటి రెండు మాత్రమే.


● **లాభసాటి వ్యాపారంగా..**

జిల్లాలో మిల్లర్లు, వ్యాపారులకు ఇదో లాభసాటి వ్యాపారంగా మారింది. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు చేరుతాయి. మిల్లర్లు వాటిని మర ఆడించి పౌరసరఫరాల శాఖకు బియ్యం అందించాలి. అయితే ఏడాదిలో ఒకటి రెండుసార్లు మాత్రమే ధాన్యం మర ఆడించి బియ్యం అందిస్తున్నారు. మిగతావి మాత్రం పదేపదే రీ పాలిష్ చేసి అందించినవే. కొందరు మిల్లర్లు వీటినే సన్నబియ్యంగా మార్చి బహిరంగ మార్కెట్‌కు అందిస్తున్నారు. మరికొందరు మిల్లు ఆడించి వాటినే బ్రాండెండ్ సంచుల్లో నింపి విక్రయిస్తున్నారు. అయితే వీటి ఆహార నాణ్యత చాలా తక్కువ. హైబ్రిడ్ ధాన్యాన్ని బీపీటీ బియ్యంగా మార్చి విక్రయిస్తున్న వారు ఉన్నారు. తూకంలోనూ 25 కిలోల దగ్గర.. అర కిలో నుంచి 2 కిలోల వరకూ మోసం చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖతోపాటు తూనికలు, కొలతల శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి అక్రమాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

● **ఇలా గుర్తించవచ్చు..**

నాణ్యత తక్కువగా ఉన్న బియ్యం పాతవే అయినప్పటికీ వండితే మాత్రం అన్నం ముద్దగా మారిపోతుంది. మెతుకు ఒకవైపు పగులుగా మారి.. వండిన కొన్ని గంటలకే చెడిపోతుంది. స్టీమ్ బియ్యం అయితే వండిన తరువాత ఎనిమిది గంటలు దాటితే అన్నం అడుగు భాగంలో పదును ప్రారంభం అవుతుంది. కొత్త బియ్యాన్ని పాత బియ్యంగా మారిస్తే ఎదుగుదల తక్కువగా ఉంటుంది.

ఘనంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కవిటి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కె.కపాసుకుద్ది గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. 40 ఏళ్లుగా కార్తీకమాసంలో శివస్వాములు మాల ధారణలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నంది, లింగాలకు రుద్రాభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, శివస్వాములు పాల్గొన్నారు.

సండే సందడి

● పర్యాటకులతో బీచ్‌లు కళకళ ● సముద్ర స్నానాలతో ఆనందం

జిల్లాలోని పలు గ్రామాల్లోని సముద్ర తీరాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. ఉదయం నుంచి సమీపంలోని తోటల్లో వనభోజనాలు చేసిన అనంతరం సముద్రంలో జలకాలాడుతూ ఆనందం పొందారు. చిన్నారుల నుంచి యువతీ యువకులు ఆట పాటలతో సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు మెరైన్ పోలీసులు పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



సంతబొమ్మాళి: భావనపాడు తీరంలో పర్యాటకులు



గార: మొగదాలపాడు బీచ్‌లో స్నానాలు చేస్తున్న సందర్శకులు



పోలాకి: రాజారాంపురం తీరంలో బందోబస్తు



హరిపురం: లక్ష్మీపురంలో పిక్నిక్..



వజ్రపుకొత్తూరు: శివసాగర్ తీరంలో పర్యాటకులు

జిల్లా రెడ్డి సంక్షేమ భవనానికి శంకుస్థాపన

శ్రీకాకుళం రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంపోలు జైలు రోడ్డు సమీపంలో ఆ సంఘ స్థలం లో ఆదివారం సంఘ వన మహోత్సవం, ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది సంఘ ప్రతినిధులు కుటుంబాలతో హాజరయ్యారు. వైసీపీ మాజీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి పాల్గొని భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ భవనం విద్యార్థుల కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని నిర్వాహకులకు సూచించారు. భవన నిర్మాణానికి అవసరమయ్యే వ్యయాన్ని తానే భరిస్తానని ప్రకటిం చారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం సంక్షేమ సంఘం నాయకులు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన కుమార్తె బట్ట గాయత్రి (18) శనివారం నుంచి కనిపించ లేదని అలికాం పంచాయతీ కరిమిళిపేటకు చెందిన తండ్రి బట్ట రమేశ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరసన్నపేటలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం కాలేజీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

ముగిసిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుజరాతీపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ముగిశాయి. ముందుగా శాస్త్రవేత్తలు సర్ సీవీ రామన్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పురుషుల, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పోలి నాయుడు, ఎ.సూర్యచంద్ర రావు మాట్లాడుతూ.. మూఢనమ్మ కాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేయా లన్నారు. అనంతరం జిల్లా స్థాయి పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, టెక్కలి ఉప విద్యాశాఖాధికారి పి.విలియం, డా.ఎం.ప్రదీప్, ఎం.ఆదినారాయణ, అర్బన్ ఎంఈవో ఎం.సుజాత, బమ్మిడి శ్రీరామూర్తి, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నృత్యాభినయం చేస్తున్న విద్యార్థినులు

ఇచ్ఛాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం శ్రీవేంకటేశ్వర మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. బ్రహ్మోత్సవాల్లో శిల్పారామం, మహతి ఆడిటోరియంలో నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన నాట్యాచార్య ఏలేశ్వరపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శిష్యులు కావ్య, శైలు, పూజా, విజయలక్ష్మి, శ్వేతా రాణి, జాగృతి, దీపిక, జైత్రి, జాహ్నవి, లిఖిత, పల్లవి, సింధు, మధు, చంద్రకళ, పూజా, అక్షయ, హేమ లత, సుజాత, గాయత్రి పాల్గొని చక్కటి నృత్యాభినయం చేసి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని టీటీడీ అధికారులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి, బలివాడ శృతిపట్నాయక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విషాద యాత్ర

(ఐదో పేజీ తరువాయి)

సునీల్ సింగ్ పటేల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా ఈ నెల 10న ఉత్తరాది, దక్షిణాది యాత్రల కోసం కారు(తుఫాన్ వాహనం)లో బయలుదేరారు. నేపాల్, కాశీ, గొరక్‌పూర్, మధుబానీ, గయా పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న తర్వాత శనివారం పూరీ చేరారు. అక్కడ జగన్నాథుడుని దర్శించుకుని శ్రీశైలం వెళ్లేందుకు పయనమయ్యారు. శనివారం రాత్రి 2.30 గంటల సమయంలో ఎత్తురాళ్ల పాడు వద్ద ఆగిఉన్న లారీని వారి వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు, క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. బోరోసింగ్ పవర్, విజయ్‌సింగ్ తోమర్, ఉషీర్‌సింగ్ మృతి చెందడటంతో ఆ ముగ్గురి భార్యలు శకుంతల బాయ్, సహస్రబాయ్, సుమన్ బాయ్‌లు కన్నీరుమున్నీరుగా విలపించారు. అలాగే తోటికోడలు సంతోషిబాయ్ కూడా మృతి చెందడంతో సావిత్రిబాయ్ రోదించారు. వారంతా రోదిస్తూ బంధువులకు ఫోన్‌లో సమాచారం అందజేశారు. పోలీసులు, నరసన్నపేటలోని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన శకుంతల బాయ్, సుమన్‌బాయ్, సంతోషి బాయ్, సావిత్రిబాయ్, సహస్రబాయ్‌తో పాటు వాహన డ్రైవర్ సునీల్ సింగ్ పటేల్‌ను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. క్షతగాత్రులను జిల్లా సామాజిక ఆసుపత్రుల సమన్వయకర్త కళ్యాణబాబు పరిశీలించారు. వైద్యులకు సూచనలు ఇచ్చి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేశారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. వారి బంధువులు వచ్చిన వెంటనే మృతదేహాలను అప్పగిస్తామన్నారు.

ఎస్పీ పరిశీలన..

సంఘటనా స్థలాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయకచర్యలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా క్షతగ్రాతులకు అందిస్తున్న వైద్య సేవలపై ఫోన్‌లో ఆరా తీశారు. మెరుగైన వైద్యసేవలు అందజేయాలని స్పష్టం చేశారు.

● ఈ సంఘటనపై మధ్యప్రదేశ్ సీఎంవో కార్యాలయం నుంచి ఆంధ్రా సీఎంవో కార్యాలయానికి సమాచారం వచ్చింది. దీంతో సీఎంవో కార్యాలయ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు. క్షతగాత్రులను టెక్కలి ఆర్డీవో పరామర్శించారు. ఊరికాని ఊరులో ప్రమాదం జరగడంతో ఏమి చేయాలో తెలియలేదని మృతుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సహాయక చర్యలు అందించిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక విలువలు పెంపొందించుకోవాలి

గుజరాతీపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతికత, సామాజిక విలువలతోపాటు వ్యక్తిగత నైపుణ్యాలు పెంపొందించు కోవాలని ఎన్‌సీసీ సీనియర్ అధికారి వంగా మహేష్ అన్నారు. నగరం లోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం 78వ ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్, కెప్టెన్ డా.యాళ్ల పోలినాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించడమే లక్ష్యమన్నారు. సీనియర్ వింగ్ గర్ల్స్ కేర్ టేకర్ ఎం.పావని, ఎం.ప్రదీప్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షల నిర్వహణ అభినందనీయం

ఎచ్చెర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేలా మోడల్ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో కారు పున్నయ్య అన్నారు. స్థానిక సాయుధ పోలీసు క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గ నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.అప్పారావు, వై.ఉమాశంకర్, జిల్లా కార్యదర్శులు జి.సురేష్, జి. శ్రీరామచంద్రమూర్తి, ఎస్.స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో సహకరించాలి



ఏపీసీ వేణుగోపాల్‌ను అభినందిస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘ ప్రతినిధులు

ఎచ్చెర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యా కార్యక్రమాల్లో మావంతు బాధ్యత నిర్వర్తిస్తామని, సహాయ సహకారాలు అందించాలని ఎస్ఎస్ఏ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు కోరారు. ఈ మేరకు ఆదివారం సమగ్రశిక్ష ఏపీసీ వప్పల వేణుగోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. పరస్పర సహకారంతో శాఖాపరమైన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఏపీసీని కలిసిన వారిలో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, కోశాధికారి సత్యనారాయణ, కార్య నిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు కామేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రూరల్ ఎస్‌ఐగా జనార్దనరావు



ఇచ్ఛాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐగా ఆర్.జనార్దనరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తానని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

26న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇచ్ఛాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ శివానంద గిరి కొండపై కొలువుతీరిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణ మహోత్సవం ఈనెల 26న నిర్వహిస్తు న్నట్లు త్రినాథ స్వామి ఆలయ యువ జన సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను 'మీకోసం.జీఓవీ.ఇన్'లో నమోదు చేసుకోవచ్చని, అలాగే ఇప్పటికే నమోదైన అర్జీల స్థితిగతులను 1100 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి 'రైతన్న మీకోసం'

ఆమదాలవలస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో సోమ వారం నుంచి 29వ తేదీ వరకు 'రైతన్న మీ కోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ, ఉద్యాన, పశు సంపద, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. పథకాల అమలు, పంచసూత్రాలు ఏపీఏఐఎంఎస్ మొబైల్ యాప్ వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి స్థలం వితరణ

పొందూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడివలస గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్థుడు పైడి కృష్ణారావు సుమారు రూ.20 లక్షల విలువ చేసే 12 సెంట్ల స్థలాన్ని అందించారు. గ్రామంలో అయ్యప్ప సన్నిధానం లేకపోవడంతో ఏళ్లతరబడి ప్రైవేటు భవనాల్లో సన్నిధానాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో అయ్యప్ప భక్తుడు పైడి కృష్ణారావు రెల్లిగెడ్డ బ్రిడ్జి సమీపంలో అత్యంత విలువైన 12 సెంట్ల స్థలం అందించారు. ఈ స్థలంలో అయ్యప్ప ఆలయం, సన్నిధానం నిర్మించ నున్నారు. స్థలాన్ని అందించిన కృష్ణారావును సర్పంచ్ టి.మనెమ్మ, సీనియర్ నాయకులు టి.వెంకట జగన్నాథం అభినందించారు.



దానం చేసిన స్థలంలో ప్రారంభమైన పనులు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతిచెందిన బిసాయి

టెక్కలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలి పెద్దబ్రాహ్మణవీధికి చెందిన బిసాయి లక్ష్మణ్ (36) ఆదివారం మధ్యాహ్నం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిసాయి నివాసం ఉంటున్న ఇంట్లోని విద్యుత్ వైర్లు వేలాడి ఉండడంతో వాటిని సరిదిద్దే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న బిసాయికి వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు..

కంచిలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లోపింటి ఆనందరావు(39) శనివారం రాత్రి రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్టు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. ఆనందరావు విశాఖలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చెన్నై హౌరా మెయిల్‌లో స్వగ్రామానికి వస్తుండగా స్టేషన్ సమీపంలో ప్రమాదానికి గురై మృతి చెందినట్లు విచారణలో తేలినట్టు పలాస జీఆర్‌పీ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆనందరావుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోంపేట రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

లగేజీ ఆటోబోల్తా.. విద్యార్థికి గాయాలు

పాతపట్నం/రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రొంపివలస గ్రామ సమీపంలో లగేజీ ఆటో బోల్తాపడిన ఘటనలో లోపింటి భరత్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లోపింటి భరత్ పాతపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో భరత్ కొరసవాడ గ్రామానికి చెందిన లగేజీ ఆటో రొంపివలస వెళ్తుండగా.. తాను వస్తానని డ్రైవర్ బొమ్మాళి మన్మథరావును భరత్ అడిగి వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో లోపింట్ భరత్‌కు నుదిటిపైనా, చాతిపైనా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ఆర్.శంకరరావు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



టెక్కలి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వేములవాడ జంక్షన్ వద్ద ఆదివారం ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. నౌపడ నుంచి టెక్కలి వైపు వస్తున్న కారు ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఘటన తర్వాత ఆ కారులో ఉన్నవారు పరారైనట్టు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు కొత్తగా స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను పుణరుద్ధరించారు.

చీడిపూడి వేంకటేశ్వరాలయంలో చోరీ



తలుపు గడియ విరగ్గొట్టిన దృశ్యం

జలుమూరు (సారవకోట), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చీడిపూడి వేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం ప్రధాన ద్వారం వద్ద గల తలుపు గడియ విరగగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆలయంలో గల 750 గ్రాముల వెండి ఆభరణాలు, ఎనిమిది కిలోల ఇత్తడి వస్తువులు అపహరించుకుపోయారు. ఆదివారం ఉదయం ఆలయం తలుపులు తెరవడానికి అర్చకులు పీసపాటి రామానుజచార్యులు వెళ్లే సరికి తలుపులకున్న గడియ విరిగి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

వజ్రపుకొత్తూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శివసాగర్ తీరంలో గల జీడి తోటల్లో ఆదివారంపేకాట ఆడుతున్న 12 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు చెప్పారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- మూడు నెలల్లో 300 కేసులపైనే..
- రోడ్డుపై నడవాలంటే భయాందోళన



పలాస కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి జంక్షన్ వద్ద గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

కాశీబుగ్గ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలో గల 31వార్డుల్లో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతీ వీధిలో 20 నుంచి 30 వరకు కుక్కలు సంచరిస్తున్నాయి. ఇటీవల కుక్కల దాడిలో చాలా మంది పిల్లలు గాయపడిన ఘటనలు ఉన్నాయి. వాహనదారులపై, పాదచారులపై దాడి చేస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో గత మూడు నెలల్లో 300 మందికి పైగా పలాస ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స చేయించుకున్నట్టు వైద్యులు చెప్పారు. ఒక 100 కేసుల వరకు పెంపుడు కుక్కలు వల్ల, మిగిలినవి వీధి కుక్కలు దాడి చేయడం వల్ల గాయపడిన వారు ఉన్నారు. కుక్కలు గుంపలుగా ఉన్నాయని వీధిలో అవి తిరగడం వల్ల అటుగా వెళ్లిన వారిపై దాడి చేస్తున్నాయి. మునిసిపల్ అధికారులు స్పందించి కుక్కల సమస్య లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చల్లవానిపేట కూడలిలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

గ్రామాల్లో విచ్చలవిడిగా..

జలుమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరిగి స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఏ సమయంలో ఎవరి పైన దాడిచేసి గాయపరుస్తాయనే భయంతో ప్రజలు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామాల్లో వీర విహారం చేస్తున్న కుక్కలు చిన్నపిల్లలపైన, దూడలుపైన, గొర్రె పిల్లలు పైన దాడి చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈ సమయంలో గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరిగి దాడులు చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చల్లవానిపేట, జలుమూరు, తిమడాం, అల్లాడ, శ్రీముఖలింగం, కొమనాపల్లి తదితర గ్రామాల్లో కుక్కలు వీర విహారం చేసి గుంపులుగా తిరుగుతున్నాయి. సంబంధిత అధికారులు కుక్కలు నివారణపై దృష్టిసారించి కుక్కలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

సర్వేకి ఆదేశించాం

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న కుక్కలపై సర్వే చేయాలని అన్ని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించాం. పూర్తి నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఈ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

\- శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్

సుందరీకరణ దిశగా టెక్కలి

- మంత్రి అచ్చెన్న చొరవతో నిధులు మంజూరు

టెక్కలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిని మరింత సుందరీకరణ దిశగా కనిపించేందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నడుంబిగించారు. ఇందులో భాగంగా శనివారం జగతిమెట్ట జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల, ఇందిరాగాంధీ కూడలి, హనుమాన్ జంక్షన్ వరకు కాలినడకన సుడా ఎస్ఈ సుగుణాకరరావు, ఉద్యానవనశాఖ ఏడీ చింతాడ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. జగతిమెట్ట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు పుట్‌పాత్, బ్యూటిఫికేషన్ చేపట్టాలని సుడా ఎస్ఈకి ఆదేశించారు. ఇందు కోసం రూ.25లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే పట్టుమహాదేవి కోనేరు గట్టు సుందీకరణ చేసేందుకు మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేయగా ఈ పనులను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మొత్తంగా టెక్కలి సుందరీకరణకు అచ్చెన్నాయుడు దృష్టి సారించారు.

దట్టంగా కురుస్తున్న మంచు



తురకపేట సమీపంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఎల్ఎన్ పేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ప్రతీరోజూ ఉదయం 8 గంటల వరకు మంచు దట్టంగా కురుస్తుంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ మంచు ప్రభావం ఎన్నిరోజులు ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నరసన్నపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఎన్‌సీసీ ఆవిర్భావ దినం సందర్భంగా క్యాడెట్లు ప్రత్యేకంగా మాస్‌డ్రిల్, పిరిమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. యువత దేశసేవలో పాల్గొనాలని పలువరు వక్తలు సూచించారు. ఎన్‌సీసీ అధికారి డి.లక్ష్మణరావు, రిటైర్డు ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

పాతపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీగిరిపై సాయినాథ ధ్యాన మందిరంలో వార్షికోత్స వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజులు చేశారు. నిర్విష ఆనందస్వామి, పడాల హరిదాస్ మాస్టార్ సత్యంగ నిర్వాహణ అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమాలతో షిరిడీగిరి ఆధ్యాత్మిక శోభనింపుకొంది. అలాగే సాయంత్రవేళ జరిగిన భగవద్గీత పారాయణంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎండల మల్లికార్జున స్వామికి భస్మాభిషేకం



విభూది అలంకరణలో మల్లన్న

టెక్కలి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జున స్వామికి ఆదివారం భస్మాభిషేకం చేశారు. ముందుగా అర్చకులు మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం విభూదితో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది.

చల్లవానిపేట కాలనీలో దాహం కేకలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

జలుమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇదివరలో అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు ద్వారా తాగునీరు కాలనీకి అందించే వారు. గత వారం రోజులు నుంచి జగనన్న కాలనీకి తాగునీరు పరఫరా నిలుపుదల కావడండో తాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. అయితే సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు టాంకరు ద్వారా తాగునీటిని అందిస్తున్నా పూర్తిస్థాయిలో చాలడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లు తాగునీటి కష్టాలు ఎదుర్కోవాలని ఆదివారం కాలనీలో గల మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీకి పూర్తి స్థాయిలో తాగునీటిని అందించి ఆదుకోవాలని కోరారు.

తెరుచుకున్న పెట్రోల్ బంకు

మెళియాపుట్టి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అక్రమాల నేపథ్యంలో చాపరలో ఇటీవల మూతపడిన ఓ పెట్రోల్ బంకును ఆదివారం నిర్వాహకులు తెరిచారు. ఈనెల 19న బంకులో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టిన అధికారులు తాత్కాలికంగా బంకు మూసివేయాలని సూచించారు. అయితే మళ్లీ ఆదివారం నుంచి యథావిధిగా అమ్మకాలు జరుగుతుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై డీఎస్‌వో సూర్యప్రకాష్‌ను వివరణ కోరగా.. బంక్‌లో చోటుచేసుకున్న వివరాలతో కూడిన నివేదికను జేసీకి ఇచ్చామని, తెరిచినట్టు తెలియదని, సీఎస్‌డీటీతో తనిఖీ చేయించి తెలుసుకుంటామన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

టెక్కలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త అడుగులు వేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. ఆదివారం టెక్కలిలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యకర్త పార్టీకి వెన్నుదన్నని, ప్రతి ఊరిలో బీజేపీ జెండా ఎగురవేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జీ, జర్జాన రామ్‌జీ, నరేంద్ర, రాజకుమార్‌రెడ్డి, పరమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సకాలంలో భవనం పూర్తి చేయాలి

మందస, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు బ్రాంచ్ భవనాన్ని సకాలంలో పూర్తి చేయాలని చైర్మన్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మందసలో ఆదివారం డీసీసీబీ బ్రాంచి నూతన భవ నానికి ఆయన భూమి పూజ చేశారు. మందస, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్లు టి.భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, జనల్ మేనేజర్లు సంతోష్‌కుమార్, వరప్రసాదరావు, జగదీష్, డీజీఎంలు జి.సునీల్, రమేస్, ఏజీఎంలు బాబ్జీ, ఆర్.భాస్కరరావు, బ్రాంచ్‌మేనేజర్ హేమంతకుమార్, సీఇవో జి.శాంతయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్న మీకోసం' వారోత్సవాలు

పలాసరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస మండలం పరిధిలో గల పంచాయతీ కేంద్రాల్లో గల ఆర్‌బీకే కేంద్రాల ఆధ్వర్యంలో రైతన్న మీకోసం వారోత్సవాల కార్యక్రమంలో ఈ నెల 24 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.వసంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుసేవా కేంద్రాల పరిధిలో ఉన్న రైతుల ఇంటింటికి వెళ్లి సుస్థిర వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకత, వ్యవసాయ యాంత్రీకరణ, మార్కెటింగ్, రసాయన ఎరువుల తగ్గింపు, సహజ వ్యవసాయానికి మార్పు, ఏపీ ఏఐఎంఎస్ రైతు యాప్ పరిచయం వంటి అంశాలపై వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాలకు సచివాలయ అధికారులు, రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భారీ వాహనాలతో ఇబ్బంది



అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుపై పరిమితికిమించిన బరువుతో వెళ్తున్న లారీ

ఎల్ఎన్ పేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు గుండా నిరంతరం పరిమితికి మించిన వాహనాలు రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అస్తవ్యస్తంగా తయారై పెద్దపెద్ద గోతులు ఏర్పాడ్డాయి. రోడ్డు మధ్య మధ్యలో ఏర్పడిన గోతులవద్ద రాళ్ల పోగులు ఏర్పడడంతో వాహనాలు వెలుతున్న సమయంలో రాళ్లతుళ్లిపోయి పక్కనుంచి వెలుతున్న వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు పరిమితికిమించి వస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకొని ప్రయాణికుల భయభ్రాంతులను తొలగించాలని కోరుతున్నారు.

పామాయిల్ సాగుచేయండి

టెక్కలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): టెక్కలి, పలాస డివిజన్ల పరిధిలో 250 హెక్టార్ల పరిధిలో పామాయిల్ చెట్లు సాగుకి లక్ష్యంగా నిర్ణయించామని ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు చింతాడ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ ఒక హెక్టారు ప్రాంతంలో పామాయిల్ మొక్కలు పెంచుకునేందుకు 12వేల మొక్కలు ఉచితంగా అందిస్తామని, అదే హెక్టారు ప్రాంతంలో అంతర పంటల సాగుకు ఏడాదికి రూ.10,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా వర్మీకంపోస్టు తయారీకి రూ.30వేలు, సాగునీటి వనరులు లభ్యత లేనిచోట బోరు వేసుకునేందుకు రూ.25వేలు, మోటార్‌కు రూ.10వేలు ఉద్యానవన శాఖ అందిస్తుందన్నారు. అలాగే 90శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పామాయిల్ చెట్లు పెంచుకునే రైతులకు అందిస్తామని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందిస్తామన్నారు. పామాయిల్ మొక్కలు నాటిన నాలుగేళ్లకు దిగుబడి వస్తుందని, ఎకరాకు సుమారు ఎనిమిది టన్నులు దిగుబడి, సుమారుగా టన్ను రూ.15వేలు ధర పలుకుతుందన్నారు.

స్కూల్‌లో భోజనశాల ఏర్పాటు

కోటబొమ్మాళి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దుప్పలపాడు గ్రామానికి చెందిన బడ్డేపల్లి అప్పలస్వామి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి రూ.80 వేలు వ్యయంతో భోజనశాల నిర్మించారు. ఆదివారం ప్రముఖవైద్యులు డాక్టర్ బలగ మురళీ చేతులు మీదుగా ప్రారంభించారు. సీపాన అన్నయ్య మాస్టర్, నరసన్నపేట ఎంఈవో పేడాడ దాలినాయుడు, సర్పంచ్ గురువెళ్లి భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీపాన త్రినాథరావు, ఉప్పాడ పూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జుడుమెట్ట పాయే!

(ఐదో పేజీ తరువాయి)

ప్రజలతోపాటు ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఉజ్జుడుమెట్ట అమ్మకాల్లో మాజీమంత్రి హస్తం ఉందంటూ ఆయనతోపాటు వైసీపీ నాయకుడి పేరుతో మావోయిస్టులు హెచ్చరికలతో కూడిన కరపత్రాలు విడుదల చేశారు. తక్షణం స్పందించిన రాష్ట్రప్రభుత్వం చరణ్ గ్రూపునకు అక్కడ ఎటువంటి రియల్‌ఎస్టేట్లు నిర్వహించవద్దని ఆదేశించింది. దీంతో చదునుచేసిన ఈ భూమిని యథాతథంగా విడిచిపెడుతూ ఈ సంస్థ వెనుదిరిగింది. ఉజ్జుడుమెట్టపై రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులు అటువైపే చూడడం మానేశారు. కాగా ఇదే అదనుగా అక్రమార్కులు ఈ కొండపై కన్నేశారు. కొద్దిరోజుల క్రితం వరకూ రాజగోపాలపురం, లొద్దభద్ర అటవీప్రాంతానికి చెందిన కొండలు కొల్లగొట్టారు. ప్రస్తుతం వారంతా ఉజ్జుడుకొండపై పడ్డారు. నెల రోజుల నుంచి రాత్రి వేళ.. కంకర తవ్వకాలు చేపట్టి ట్రిప్పర్లతో తరలిస్తున్నారు. చదును చేసిన మెట్టప్రాంతమంతా మొత్తం గొయ్యిలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతమంతా కనీసం స్వరూపం లేకుండా పోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తిని వివరణ కోరగా తవ్వకాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. తాము ఎవరికీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

సమాజ సేవే సాయి మార్గం

- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



మాట్లాడుతున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు

పలాసరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన, భక్తిభావంతో పాటు సమాజ సేవ చేయడమే పుట్టపర్తి సత్యసాయిబాబా మార్గమని, ఆ బాటలో ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. రామకృష్ణాపురం శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో సత్యసాయిబాబా శత జయంతుత్సవాలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తిమార్గం, అసాధారణ శక్తులతో కోట్లా మంది జీవితాలను సత్యసాయి ప్రభావితం చేశారన్నారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొని సత్యసాయికి నివాళులర్పించారు. విద్యార్థులు అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సత్యసాయి పాఠశాల ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా సత్యసాయి శత జయంతుత్సవాలు ఘనంగా నిర్వహించారు.



కాశీబుగ్గ: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



నరసన్నపేట: కిళ్లాంలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి



పాతపట్నం: దుప్పట్లు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పోలాకి: సత్యసాయి మందిరంలో 100 రకాల స్వీట్లు నివేదించిన భక్తులు



పొందూరు: పట్టణంలో సత్యసాయి చిత్రపటంతో..



ఇచ్ఛాపురం: పట్టణంలో నగర సంకీర్తన..



వజ్రపుకొత్తూరు: బైపల్లిలో నగర సంకీర్తన



నందిగాం: బడగాంలో బాబా చిత్రపటంతో..



టెక్కలి: సత్యసాయి మందిరంలో..



గార: గోరువానిపేటలో సత్యసాయి వ్రతాలు చేస్తున్న భక్తులు



కవిటి: చండిపుట్టుగలో సత్యసాయి వ్రతాలు చేస్తున్న మహిళలు